# నమస్తే తెలంగాణ
# కరీంనగర్

5 | కరీంనగర్, గురువారం 16 మే 2024 | KARIMNAGAR


# రోడ్డెక్కిన రైతన్న

**వడ్ల కొనుగోళ్లలో జాప్యంపై మల్కపేటలో ధర్నా**

కోనరావుపేట, మే 15: కేసీఆర్ పాలనలో నిరందీగా సాగు చేసిన రైతులు, ఇప్పుడు కాంగ్రెస్ పాలనలో ఆగమవుతున్నారు. ఆరుగాలం శ్రమించి పండించిన వడ్లను సకాలంలో అమ్ముకోలేక ఆందోళన చెందుతున్నారు. ధాన్యం కొనుగోలులో జాప్యాన్ని నిరసిస్తూ రోడ్డెక్కుతున్నారు. కోనరావుపేట మండలం మల్కపేట రైతులు బుధవారం గ్రామ ప్రధాన రహదారి (సిరిసిల్ల – కోనరావుపేట)పై రోడ్డుపై బైఠాయించి ధర్నా చేశారు. కేంద్రాల్లో వడ్లు పోసి నెల కావస్తున్నా ఇప్పటి వరకు సరిగా కొనుగోలు చేయడం లేదని మండిపడ్డారు. తూకం వేసిన ధాన్యం బస్తాలు వారం గడుస్తున్నా తరలించడం లేదని, లారీల కొరత ఉందని చెబుతున్నారని, దీంతో కేంద్రాల్లోనే ధాన్యాన్ని ఉంచాల్సి వస్తున్నదని ఆగ్రహిస్తున్నారు. వెంటనే కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయకపోతే కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. కొలనూర్ సింగిల్ విండో చైర్మన్ రామ్మోహన్‌రావు వచ్చి రైతులను సముదాయించారు. ఫోన్‌లో ఉన్నతాధికారులతో మాట్లాడారు. రెండు రోజుల్లో కొనుగోళ్లు పూర్తయ్యేలా చూస్తానని హామీ ఇచ్చారు. సుమారు రెండు గంటల పాటు ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచి పోగా.. పోలీసులు ట్రాఫిక్ క్లియర్ చేశారు



వడ్లు ఎందుకు కొనడం లేదని ఆగ్రహిస్తూ మల్కపేటలో ధర్నా చేస్తున్న రైతులు

### నెల దాటింది.. ఇంకెప్పుడు కొంటరో



నాకున్న రెండున్నర ఎకరాల్లో వరి పంట పండించిన. నెల కిందనే వరి కోసి కొనుగోలు కేంద్రానికి తెచ్చిన. నేను వడ్లు తెచ్చిన నెల రోజులకు ధాన్యం తూకం వేసిన్రు. తూకం వేసి వారం గడుస్తున్నా ఇప్పటివరకు మిల్లులకు తరలించలేదు. దీంతో రోజూ వడ్ల దగ్గరే కావలి ఉంటున్న. వాన పడ్డప్పుడు వడ్లపై టార్పాలిన్లు కప్పుతున్న. తర్వాత ఆరబెడుతున్న. ఇదే నాకు డ్యూటీ అయింది. నెల దాటింది. ఇంకెప్పుడు తరలిస్తరో..

**-జంగిటి భూమయ్య, రైతు (మల్కపేట)**

# స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద అప్రమత్తంగా ఉండాలి

- కలెక్టర్ పమేలా సత్పతి



స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రమేలాసత్పతి, సీపీ అభిషేక్ మొహంతి

కలెక్టరేట్, మే 15 : కరీంనగర్ ఎస్సారార్ కళాశాలలో భద్రపరిచిన ఈవీఎంల స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద, భద్రతా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని కరీంనగర్ పార్లమెంట్ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశించారు. బుధవారం ఆమె పోలీస్ కమిషనర్ అభిషేక్ మొహంతితో కలిసి స్ట్రాంగ్‌రూమ్‌లను సందర్శించారు. భద్రత ఏర్పాట్లను పర్యవేక్షించారు. సీసీ కెమెరాల పనితీరు, పోలీస్ సిబ్బంది విధుల నిర్వహణ తదితర అంశాలపై చర్చించి అధికారులకు దిశా నిర్దేశం చేశారు. అదేవిధంగా కళాశాల పరిసరాలు పరిశీలించారు. ఉదయం, సాయంత్రం వేళల్లో వాకర్స్, ఇతరులు కాలేజీలోకి రాకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. లెక్కింపు పూర్తయ్యే వరకు రాత్రి వేళల్లో కూడా అలర్ట్‌గా ఉండాలన్నారు. వారి వెంట కరీంనగర్ ఆర్డీవో కే మహేశ్వర్, టౌన్ ఏసీపీ నరేందర్ ఉన్నారు.

# మా కొడుకును కాపాడండి

- ఇటీవల రోడ్డు ప్రమాదంలో మంథనికి చెందిన యువకుడి తలకు గాయం
- అప్పులు చేసిమరీ కరీంనగర్‌లోని ప్రైవేట్ దవాఖానలో చికిత్స..
- ఆపన్నహస్తం అందించాలని తల్లిదండ్రుల వేడుకోలు



సాయిమణితేజ(ఫైల్)

మంథని, మే 15: విధి వెక్కిరించింది. రెక్కాడితే గాని డొక్కాడని కుటుంబానికి పెద్ద కష్టం వచ్చిపడింది. చేతికంది వచ్చిన కొడుకు రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి దవాఖానలో చేరగా, కాపాడుకునేందుకు తల్లడిల్లుతున్నది. రోజుకు ₹50వేలకు పైగా ఖర్చవుతుండడంతో ఆపన్నహస్తం కోసం దీనంగా ఎదురు చూస్తున్నది. వివరాల్లోకి వెళితే.. మంథని పట్టణం దొంతులవాడలోని రజక వీధికి చెందిన కొల్లూరి రాజేశ్వరీ–సమ్మయ్యకు కూతురు, కొడుకు సాయిమణితేజ ఉన్నారు. అయితే 15 రోజుల క్రితం ఓ పని నిమిత్తం బైక్‌పై లద్నాపూర్ వెళ్తుండగా మార్గం మధ్యలో వాహనం అదుపు తప్పి, సాయి మణితేజ తీవ్ర గాయాలపాలయ్యాడు. తలకు బలమైన గాయం కావడంతో కోమాలోకి వెళ్లిపోయాడు. గంట వ్యవధిలోనే సమాచారం రావడంతో కుటుంబసభ్యులు అక్కడికి చేరుకొని, కరీంనగర్‌కు తీసుకెళ్లి ఓ ప్రైవేట్ దవాఖానలో చేర్పించారు. కొడుకును ఎలాగైనా బతికించుకోవాలనే ఉద్దేశంతో ఉన్నదంతా ఖర్చు పెట్టి మరీ వైద్యం చేయిస్తున్నారు. రోజుకు ₹50వేలకుపైగా ఖర్చవుతున్నదని, తమ శక్తి సరిపోవడం లేదని ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం చేతిలో చిల్లి గవ్వ కూడా లేదని, దాతలు ముందుకు వచ్చి సాయం చేసి మా కొడుకును కాపాడాలని రాజేశ్వరీ–సమ్మయ్య వేడుకుంటున్నారు. సాయం చేయాలనుకునే వారు 8885200731, 7207200731 నంబర్లకు ఫోన్ పే లేదా జీ పే చేయాలని కోరుతున్నారు.



దవాఖానలో చికిత్స పొందుతున్న సాయిమణితేజ

# మరణించిన మేకలకు పరిహారం ఇవ్వాలని..

- కొత్తపల్లి బల్దియా ఆఫీసు ఎదుట కళేబరాలతో నిరసన
- అధికారుల నిర్లక్ష్యమేనంటూ యజమాని ఆగ్రహం

కొత్తపల్లి, మే 15: కుక్కల దాడిలో మరణించిన మేకలకు పరిహారం ఇవ్వాలని యజమాని మేకల కళేబరాలతో మున్సిపల్ ఆఫీసు ఎదుట నిరసన తెలిపాడు యజమాని. కుక్కల నియంత్రణలో బల్దియా అధికారులు విఫలం కావడంతోనే రెండుసార్లు తన మేకలు మృత్యువాతపడ్డాయని ఆరోపించాడు. కొత్తపల్లికి చెందిన అజీజొద్దీన్‌కు చెందిన మేకల మందపై బుధవారం తెల్లవారుజామున కుక్కలు దాడి చేసి నాలుగు మేకలను చంపివేశాయి. కొన్ని రోజుల క్రితం సైతం కుక్కల దాడిలో అతనికి చెందిన ఐదు మేకలు మరణించాయి. దీంతో ఆగ్రహించిన అజీజొద్దీన్ బుధవారం మేకల కళేబరాలతో కొత్తపల్లి మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేశాడు. సుమారు ₹40 వేలు నష్టపోయాయని, వెంటనే పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశాడు. ఈ విషయంపై కమిషనర్ రమేశ్‌ను సంప్రదించగా, కుక్కల దాడిలో మేకలు మృతి చెందిన ఘటనపై గురువారం కలెక్టర్‌కు నివేదిస్తామని తెలిపారు. కలెక్టర్ అనుమతి తీసుకొని కుక్కలకు స్టెరిలైజ్ చేయిస్తామని మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజు హామీ ఇచ్చారు.



చనిపోయిన మేకలతో మున్సిపల్ కమిషనర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న అజీజొద్దీన్

## మోసం చేయడం కరెక్ట్ కాదు



నేను ఐదెకరాల్లో దొడ్డు రకం వడ్లు వేసిన. 20 రోజుల కిందనే కోసి కేంద్రానికి తెచ్చిన. కొనెటోళ్లు లేరు. ఎన్నికల ముందేమో రేవంత్‌రెడ్డి ఎన్నో హామీలు ఇచ్చిండు. అవి నెరవేర్చకుండా ఇప్పుడు వెకిలి మాటలు మాట్లాడుతున్నడు. రుణమాఫీ, రైతుభరోసా తుంగలో తొక్కిండు. అప్పుడు అన్ని రకాల వడ్లకు క్వింటాల్‌కు ₹500 చొప్పున బోనస్ ఇస్తానని చెప్పిండు. ఇప్పుడేమో సన్నవడ్లకే అంటున్నడు. రైతులను మోసం చేయడం సరికాదు. ఏమన్న అంటే దేవుళ్లపై ఒట్లు పెడుతున్నడు. అలా ఒట్లు పెట్టుడు కాదు, రైతులకు ఇచ్చిన హామీలు నెరవేర్చుడే గొప్ప. కానీ, ఇలా మాటమార్చడం కరెక్ట్ కాదు. ఇలాంటి వ్యక్తి సీఎం కావడం అన్నదాతకు శాపమే.

**- మహిపాల్, యువరైతు, మల్కపేట (కోనరావుపేట)**



# బోనస్.. బోగసేనా..?

## అన్నదాత మరోసారి దగా

### సర్కారు రైతు వ్యతిరేక విధానాలపై కేసీఆర్ పిడికిలి

- రైతు వ్యతిరేకిగా రాష్ట్ర సర్కారు
- ఏ ఒక్క హామీని అమలు చేయని ప్రభుత్వం
- బోనస్‌పై పూటకో మాట
- ఎన్నికల ముందు వడ్లకు ₹500 ఇస్తామని హామీ
- ఇప్పుడేమో కేవలం సన్నవడ్లకేనని వంచన
- కర్షకలోకానికి అండగా నిలుస్తున్న అధినేత కేసీఆర్
- నేడు రాష్ట్ర వ్యాప్త నిరసనలకు పిలుపు



**కాంగ్రెస్ సర్కారు రైతు వ్యతిరేకిగా వ్యవహరిస్తున్నది. రైతులకిచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చకుండా దగా చేస్తున్నది. ఎన్నికల ముందు ₹2 లక్షల రుణమాఫీ, రైతుభరోసా, బోనస్ అంటూ ఇలా ఎన్నో చెప్పి.. అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్కొక్కటిగా నీరుగారుస్తున్నది. మొన్నటిదాకా వరికి ₹500 బోనస్ చెల్లిస్తామని మభ్యపెట్టి.. పార్లమెంట్ ఎన్నికలు ముగిసిన తెల్లారే మాటమారుస్తున్నది. తాజాగా, సన్నవడ్లకే బోనస్ అని రేవంత్‌రెడ్డి చెప్పిన మాటతో రైతులు తీవ్ర అసంతృప్తికి లోనవుతున్నారు. ఇప్పటికే రైతుభరోసాను దాటవేశారని, ఇప్పుడు బోనస్ ఇవ్వకుండా తప్పించుకునే ప్రయత్నం చేయడంపై ఆందోళనకు గురవుతున్నారు. పోయినేడు యాసంగి వరకు నిరందీగా సాగు చేసుకున్నామని, ఇప్పుడు మాత్రం ఎవుసం అంటేనే భయపడే పరిస్థితి వచ్చిందని వాపోతున్నారు. సాగునీరు, కరెంట్‌కు గోసపడ్డామని, రెక్కలు ముక్కలు చేసుకొని పండించిన ధాన్యం అమ్ముకునేందుకు తిప్పలు పడతున్నామంటూ కన్నీరు పెడుతున్నారు. ఈ పరిస్థితులను చూసి చలించిపోయిన బీఆర్ఎస్ అధినేత మరోసారి రైతుల కోసం ఉద్యమిస్తున్నారు. కాంగ్రెస్ రైతు వ్యతిరేక విధానాలను ఖండిస్తూ నేడు రాష్ట్ర వ్యాప్తంగా నియోజకవర్గ కేంద్రాల్లో నిరసనలకు పిలుపునిచ్చారు.**

కరీంనగర్, మే 15 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో ప్రధాన పంట అయిన వరి ప్రతి క్వింటాల్‌కు ₹500 బోనస్ ఇస్తామని కాంగ్రెస్ అధికారంలోకి రాకముందు చెప్పింది. ఎన్నికల మ్యానిఫెస్టోలో కూడా చేర్చింది. రేవంత్‌రెడ్డితోపాటు కాంగ్రెస్ నాయకులు కూడా ప్రతి సభలో ఈ విషయాన్ని విపరీతంగా ప్రచారం చేశారు. రైతు డిక్లరేషన్ సభలు పెట్టి మరీ గొప్పగా చెప్పుకున్నారు. అంతే కాకుండా, బీఆర్ఎస్ ఇచ్చిన రైతుబంధు తరహాలో రైతు భరోసా పథకాన్ని ప్రవేశపెట్టి ఎకరానికి ఏటా ₹10 వేలు కాకుండా.. మరో ₹5 వేలు కలిపి ₹15 వేలు ఇస్తామని హామీ ఇచ్చారు. పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత యాసంగి పంటకు మాత్రం ఎకరానికి ₹5 వేలు మాత్రమే ఇచ్చారు. వంద రోజుల్లో రైతులకు ₹2 లక్షల వరకు పంట రుణమాఫీ చేస్తామని చెప్పినా.. ఇప్పటి వరకు చేయలేకపోయారు. పైగా ఆగస్టు 15 వరకు అమలు చేస్తామని సీఎం రేవంత్ ప్రకటించినప్పటికీ.. రైతులు అనుమానాలు వ్యక్తం చేస్తూనే ఉన్నారు. రైతు భరోసాను కూడా వాయిదా వేయగా, ఇప్పుడు వడ్లపై బోనస్ హామీని కూడా పక్కదారి పట్టిస్తుండడం అన్నదాతలను ఆందోళనకు గురి చేస్తున్నది.

### బోనస్‌పై నిరాశేనా..?

రైతులు పండించిన పంటలపై బోనస్ ఇస్తామని ఎన్నికల ముందు రేవంత్‌రెడ్డి ఎన్నోసార్లు చెప్పారు. వరి క్వింటాల్‌కు ₹500 ఇస్తామని పదే పదే గుర్తు చేశారు. కానీ, ఇప్పుడు పార్లమెంట్ ఎన్నికలు ముగిసిన తెల్లారే మాట మార్చారు. సీఎం హోదాలో హైదరాబాద్‌లో జరిగిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. సన్న వడ్లు పండించిన వారికే బోనస్ ఇస్తామని చెప్పడంతో రైతులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. రైతు వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న కాంగ్రెస్ సర్కారు తీరుపై ఆగ్రహిస్తున్నారు.

### రైతుల్లో ఆగ్రహం

రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన పంటకు కేంద్ర ప్రభుత్వం కనీస మద్దతు ధర ప్రకటిస్తుంది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వాలు కొనుగోలు చేయాలి. ప్రతి క్వింటాల్ ధాన్యానికి కేంద్రం ఇచ్చేది ₹2,203 కాగా, దీనికి ₹500 బోనస్ తోడైతే ₹2,703 అయ్యేది. రైతులకు ఇది ఎంతో ఊరటనిచ్చేది. కానీ, ఇప్పుడు రేవంత్ ప్రకటనతో రైతులు తీవ్ర నిరాశకు లోనవుతున్నారు. ఈ సీజన్‌లోనే బోనస్ వస్తుందని ఆశించినా ప్రయోజనం లేకపోయిందని వాపోతున్నారు. ఇన్నాళ్లూ మభ్య పెట్టిన ప్రభుత్వం, తీరా ఇప్పుడు సన్నవడ్లకేనంటూ ప్రకటించడం ఎంత వరకు కరెక్టని మండి పడుతున్నారు. కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో ఎక్కువ మంది దొడ్డు వడ్లనే పండిస్తారని, సన్నాలు పండించే వారిని వేళ్ల మీద లెక్కించవచ్చని చెబుతున్నారు. కేవలం సన్నాలు పండించే వారికి మాత్రమే బోనస్ వర్తిస్తే తమ పరిస్థితి ఏంటని? ఇలాంటి హామీలు ఇచ్చి ఎందుకు మోసం చేస్తున్నారని ప్రశ్నిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి రైతులపై చిత్తశుద్ధి లేదని, ఇప్పటి వరకు ఏ ఒక్క హామీ నెరవేర్చలేదని ఆగ్రహిస్తున్నారు. రైతును రాజును చేయాలనే లక్ష్యంతో పనిచేసిన కేసీఆర్ ప్రభుత్వానికి, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎంతో తేడా కనిపిస్తున్నదని చెబుతున్నారు.



### రైతులను దగా చేసింది



మొన్నటి దాక పండిన ప్రతీ వడ్లగింజకు మద్దతు ధరతోపాటు ₹500 బోనస్ ఇస్తమని కాంగ్రెస్ పెద్దలు చెప్తే సపోర్ట్ చేసినం. కనీ, ఇప్పుడు కేవలం సన్న వడ్లకే ఇస్తమనుడు కరెక్ట్ కాదు. ఈ ప్రభుత్వం రైతులను దగా చేసింది. గత పసలు నుంచి సగానికి పైగా పెట్టుబడికే పోతున్నయి. ఈ ప్రభుత్వం క్వింటాల్‌కు బోనస్ ఇస్తమంటే మిగుల్తయి అనుకుంటున్నం. కనీ, ఇప్పుడు మాట మార్చుతున్నరు.

**-ఎల్లాల లచ్చిరెడ్డి, రైతు, పారువెల్ల, గన్నేరువరం మండలం(తిమ్మాపూర్)**

### బోనస్ ఇవ్వకుంటే ఊరుకోం



ఈ ప్రభుత్వం వచ్చిన కొద్ది రోజులకే రైతులకు న్యాయం చేయదని మాకు అర్థమైంది. పండిన వడ్లనే ఇబ్బంది లేకుంట కొనుడు ఎక్కవ అనుకున్నం. ఇగ ఈ బోనస్ ముచ్చట బోగసే అని అనుకున్నం. అనుకున్నట్టే అంతా బోగస్ ముచ్చటే అయింది. కేవలం సన్నవడ్లకే రూ.500 బోనస్ ఇస్తం అని మాట మార్చుతున్నరు. ఈ ప్రభుత్వం రైతు వ్యతిరేకి. పండిన ప్రతి వడ్ల గింజకు బోనస్ కట్టియ్యాలె. లేకపోతే ఊరుకోం.

**-ఆవుల మల్లేశ్, రైతు, రామకృష్ణకాలనీ(తిమ్మాపూర్)**



### అన్నదాతకు అండగా కేసీఆర్

ఉమ్మడి రాష్ట్రంలో దండుగ అయిన వ్యవసాయాన్ని స్వరాష్ట్రంలో పండుగలా మార్చిన బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అన్నదాతకు ఎల్లవేళలా అండగా నిలుస్తున్నారు. పదేళ్లలో రైతుల సంక్షేమం కోసం అనేక పథకాలు ప్రవేశపెట్టడమే కాకుండా, సాగునీరు, 24 గంటల కరెంటు వంటివి కల్పించి భరోసా కల్పించారు. అంతే కాకుండా, ప్రతిపక్షంలోనూ రైతుల సమస్యల పరిష్కారం కోసం పోరాటానికి సిద్ధమయ్యారు. అసెంబ్లీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ విఫలం కావడంతో సర్కారుపై యుద్ధం చేస్తున్నారు. అకాల వర్షాలతో పంటలు నష్టపోగా.. గత నెల 5న కరీంనగర్ రూరల్ మండలం మొగ్దుంపూర్, బోయినపల్లిలో స్వయంగా పంటలను పరిశీలించి, రైతులకు 'మేమున్నా'మంటూ అభయమిచ్చారు. సాగునీరు అందక ఎండిపోయిన పంటలకు ఎకరానికి ₹25 వేల పరిహారం చెల్లించాలని, వరి క్వింటాల్‌కు ₹500 బోనస్ చెల్లించాలని, ₹2 లక్షల రైతు రుణమాఫీ వెంటనే అమలు చేయాలని గత నెల 6న బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ధర్నాలు చేసి రైతులకు మద్దతుగా నిలిచారు. అంతేకాకుండా, సాగునీరు అందక పంటలు ఎండుతుండడంతో రైతుల వెన్నంటి ఉంటూనే సర్కారు దిగొచ్చేలా ఆందోళనలు చేపట్టారు. తాజాగా, సీఎం రేవంత్‌రెడ్డి సన్న వడ్లకే ₹500 బోనస్ ఇస్తామని మాట మార్చడంపై రైతులు ఆందోళన చెందుతుండగా.. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మరోసారి ఉద్యమానికి సిద్ధమయ్యారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతాంగ వ్యతిరేక చర్యలను ఖండిస్తూ గురువారం రాష్ట్ర వ్యాప్తంగా నియోజకవర్గ కేంద్రాల్లో నిరసనలు చేపట్టాలని పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

# ఈతకు నేర్చుకునేందుకు వెళ్లి..

- బావిలో మునిగి ఇంటర్ విద్యార్థి మృత్యువాత
- ఇంటికి వచ్చే క్రమంలో ప్రమాదవశాత్తూ నీటిలో పడి మృతి
- జీలకుంటలో విషాదం



అరవింద్(ఫైల్)

ఓదెల, మే 15: ఈత నేర్చుకోవడానికి వెళ్లిన ఇంటర్ విద్యార్థి అనుకోని రీతిలో మృత్యుఒడికి చేరాడు. తల్లిదండ్రులకు తీరని దుఃఖాన్ని మిగిల్చాడు. పోలీసుల వివరాల ప్రకారం.. జీలకుంటకు చెందిన దొడ్డిపెల్లి కుమారస్వామి– రేణుక దంపతులకు ఇద్దరు కొడుకులు. అందులో పెద్దోడు అరవింద్ (19) ఓదెల మోడల్ స్కూల్‌లో ఇటీవలే ఇంటర్మీడియెట్ ఫస్టియర్ పూర్తి చేశాడు. ప్రస్తుతం వేసవి సెలవులు కావడంతో ఈత నేర్చుకోవాలనుకున్నాడు. బుధవారం స్నేహితులతో కలిసి గ్రామ శివారులోని వ్యవసాయ బావి వద్దకు వెళ్లాడు. నడుముకు ఖాళీ ప్లాస్టిక్ ఆయిల్ క్యాన్లు కట్టుకుని కొద్దిసేపు బావిలో ఈత నేర్చుకునే ప్రయత్నం చేశాడు. ఇంటికి వెళ్లే క్రమంలో అందరితోపాటు అరవింద్ కూడా బావి పైకి వచ్చాడు. కాలికి బురద అంటడంతో బండరాయి మీద నిల్చొని కడుక్కుంటున్న సమయంలో ప్రమాదవశాత్తు కాలుజారి బావిలో పడ్డాడు. గమనించిన స్నేహితులు రక్షించే ప్రయత్నం చేసినా ఫలితం లేకుండా పోయింది. నీటిలో మునిగి చనిపోయాడు. కుటుంబసభ్యులు, గ్రామస్తులకు సమాచారం అందించడంతో వెంటనే అక్కడికి చేరుకున్నారు. బావిలో నుంచి అరవింద్ మృతదేహాన్ని బయటికి తీయడంతో తల్లిదండ్రులు ఒక్కసారిగా గొల్లుమన్నారు. మృతదేహంపై పడి గుండలవిసేలా రోదించారు. పొత్కపల్లి ఎస్ఐ అశోక్‌రెడ్డి ఘటనా స్థలానికి వెళ్లి ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. తండ్రి కుమారస్వామి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

# 'బాల పురస్కార్'కు దరఖాస్తుల ఆహ్వానం

కరీంనగర్ కలెక్టరేట్, మే 15 : మహిళా శిశు సంక్షేమ శాఖ అధ్వర్యంలో 2024–2025 సంవత్సరానికి ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్–25 కోసం బాలబాలికలు దరఖాస్తు చేసుకోవాలని కరీంనగర్ జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ రంగాల్లో ఆవిష్కరణ, సృజనాత్మకత, అభ్యాస వాతావరణం, సాంస్కృతిక, కళలు, సాహసం, క్రీడలు, సామాజిక సేవ, శాస్త్ర, సాంకేతిక రంగాల్లో ప్రతిభ చూపిన బాలబాలికలు ( 5 నుంచి 18 ఏళ్ల లోపు వారు) జూలై 31లోగా https:// awards.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు ఆన్‌లైన్ వెబ్‌సైట్ లేదా భగత్‌నగర్‌లోని బాల రక్ష భవనం, కార్యాలయంలోని డీసీపీవో (ఇన్‌చార్జి) శాంత (83329 87862)ను సంప్రదించాలని సూచించారు.

# పెద్దపల్లి సర్కిల్‌కు ప్రథమ స్థానం

పెద్దపల్లి, మే15 : ఏప్రిల్‌కు సంబంధించి అసిస్టెంట్ ఇంజినీర్, అసిస్టెంట్ డి విజనల్ ఇంజినీర్, డివిజనల్ ఇంజినీర్, సూపరింటెండెంట్ ఇంజినీర్ (సబ్ డివిజన్, డివిజన్, సర్కిల్) పూర్తి చేసిన పని, అన్ని రకాల పనులపై సాధించిన ప్రగతి ని దృష్టిలో ఉంచుకొని ఎన్‌పీడీసీఎల్ ప రిధిలోని 16సర్కిళ్లకు సంస్థ ఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి ర్యాంకులు ప్రకటించారు. అందులో పెద్దపల్లి సర్కిల్‌కు ప్రథమ స్థానం వచ్చిందని పెద్దపల్లి సూపరింటెండెంట్ ఇంజినీర్ సుదర్శనం తెలిపారు.


